క్లుప్తంగా

తూమాటి పరామర్శ



హేమంత్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ మాధవరావు

ఉలవపాడు: ఇటీవల సముద్రంలోపడి మృతి చెందిన శింగోతు హేమంత్ కుటుంబాన్ని ఎమ్మెల్సీ మాధవరావు ఆదివారం పరామర్శించారు. కరేడు పల్లెపాలెంలోని వారి ఇంటికి వెళ్లి మరణించిన హేమంత్ తల్లితండ్రులు గోపాల్‌రావు, రాజేశ్వరితో మాట్లాడారు. సముద్రంలో గల్లంతై మృతి చెందినట్లు వారు తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు తూమాటి సానుభూతి తెలియచేశారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొండపి: మండలంలోని పెట్లూరు సబ్ స్టేషన్ పరిధిలో 33 కేవీ లైన్‌లో చెట్లు తొలగిస్తున్నందున సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పువ్వాడి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని పెట్లూరు, కోయవారిపాలెం, గుర్రప్పడియ, దాదా నాయుడుపాలెం, చౌటపాలెం గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు. సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామ ప్రజలు విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

కోడి పందేల శిబిరంపై పోలీసుల దాడి

కొండపి: కోడి పందేల శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈఘటన మండలంలోని కొండపిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై ప్రేమ్ కుమార్ వివరాల మేరకు.. ప్రకారం మండల కేంద్రమైన కొండపిలో జాల్లపాలెం వెళ్లే దారిలో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. వెంటనే సిబ్బందితో కలిసి కోడి పందెం శిబిరంపై దాడి చేసి రెండు కోళ్లు, రూ. 5600 నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కోడిపందేలు ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోనికి తీసుకొని కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తుంటే వివరాలు అందించాలని, తెలిపిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

దేవాలయాల్లో భక్తుల పూజలు



పెద్దారవీడు: మండలంలో గుండంచర్ల గ్రామం సమీపంలో నల్లమల అడవిలో వెలసిన గంగా భవానీ వేణూతల కాటమరాజుస్వామి, పెద్దారవీడు గ్రామం సమీపంలో వెలసిన అంకాళమ్మ దేవత, ఎస్ కొత్తపల్లి గ్రామం సమీపంలో వెలసిన శ్రీనాగాంజనేయస్వామి పుట్టకు భక్తులు భక్తిశ్రద్ధలతో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కాటమరాజుస్వామి, గంగభవానీ దేవతకు అభిషేకాలు, పూజలు చేసి పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమ, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అంకాళమ్మ దేవతకు మహిళలు పసుపు, కుంకుమ, చీరలు, గాజులు, నాగమయ్యపుట్టకు పాలు, పండ్లు సమర్పించారు. అంకాళమ్మ దేవతను పట్టువస్త్రాలు, అభరణాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు ఆలయం ప్రాంగణంలో పొంగళ్లు తయారు చేసి స్వామి, అమ్మవార్లకు నైవేద్యం చెల్లించారు. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, మొక్కుబడులు చెల్లించారు.

గడపలోకి వెళ్లాలంటే సమస్యల భయం

- ఎమ్మెల్యే ఇంటూరిని నిలదీస్తున్న ప్రజలు
- సుపరిపాలన కార్యక్రమంలో సమస్యల వెల్లువ
- ఇంటింటికీ వెళ్లాలంటే భయపడుతున్న టీడీపీ నాయకులు



పారిశుద్ధ్య అధ్వానంగా ఉందని ప్రశ్నించిన కోటేశ్వరరావు (ఫైల్)



గ్యాస్ డబ్బులు పడలేదని ప్రశ్నిస్తున్న మహిళ (ఫైల్)



ఉపాధి మస్టర్ సక్రమంగా వేయలేదని ప్రశ్నిస్తున్న టీడీపీ కార్యకర్త (ఫైల్)

ఉలవపాడు: సంక్షేమ పథకాలు సక్రమంగా ఇవ్వకుండా.. ప్రజల సమస్యలు పరిష్కరించకుండా ఎమ్మెల్యేలను, నాయకులను సుపరిపాలన పేరుతో ఇండ్ల వద్దకు వెళ్లమని చంద్రబాబు ఆదేశించారు. ఇప్పుడు ఈ కార్యక్రమం పేరుతో ప్రతి ఇంటికి వెళ్లి గడప తొక్కాలంటే టీడీపీ నాయకులకు సమస్యల భయం పట్టుకుంది. శనివారం మండల కేంద్రం అయిన ఉలవపాడులోని అంబేద్కర్ నగర్‌లో జరిగిన 'సుపరిపాలన-తొలి అడుగు' కార్యక్రమానికి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరయ్యారు. అంబేద్కర్ నగర్‌లో ప్రజలు అయనకు సమస్యల స్వాగతం పలికారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందడం లేదని, ప్రభుత్వ పనితీరు బాగాలేదని ఆయనను నిలదీశారు. ఏదో వచ్చాం.. పోయాం అనే విధంగా ఇంటి దగ్గర కాసేపు కూడా నిలబడకుండా వెళ్లిపోవాలనే ఉద్దేశంతో కార్యక్రమం నిర్వహించారు. గత ఎన్నికల్లో టీడీపీకి చేసినవారే ఆయనను సమస్యలతో నిలదీశారు. అంబేద్కర్ నగర్‌లో తొలిబజారు నుంచే ప్రశ్నించడం ప్రారంభించారు.

సమస్యలు ఏకరువుపెట్టిన టీడీపీ కార్యకర్తలు, నాయకులు..

టీడీపీ కార్యకర్త చింతల ముసలయ్య తన బిడ్డలు ఉపాధి పనులకు వెళుతున్నా వారికి మస్టర్లు వేయడం లేదని, అదేమని లిస్టు అడిగితే ఇవ్వడం లేదని ప్రశ్నించారు. తాను 25 ఏండ్ల నుంచి టీడీపీ అని ముద్ర వేసుకున్నా కానీ మాకు కూడా ఉపాధి పనులు ఇవ్వడం లేదని తెలియచేశారు. రెండో బజారులో గ్యాస్ డబ్బులు పడడం లేదని కొప్పోలు కోటేశ్వరి ప్రశ్నించారు. తాను గ్యాస్ కంపెనీకి వెళ్లి ఎన్నిమార్లు అడిగినా నాకు నగదు పడలేదని తెలిపారు. ఈ-కేవైసీ, బ్యాంకు అకౌంట్ అన్నీ కరెక్టుగానే ఉన్నా ఒక్క సారి కూడా గ్యాస్ నగదు పడలేదని ప్రశ్నించారు. దోమల బెడద అధికంగా ఉందని, బజార్లు చిమ్మడం లేదని, డ్రైనేజీలలో చెత్తతీయడం లేదని చిరుతోటి కోటేశ్వరరావు ప్రశ్నించారు. తాము వెళ్లి ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యేను నిలదీశారు. విద్యుత్ సక్రమంగా ఉండడం లేదని పరిస్థి దారుణంగా ఉందని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. ఈ సుపరిపాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటికి వచ్చి నిమిషం కూడా ఉండకుండా కరపత్రాలు ఇచ్చి వెళ్లిపోతున్నాడని అందుకే కొన్ని సమస్యలు అడగలేకపోయామని ప్రజలు అంటున్నారు.

అలా వస్తున్నారు.. ఇలా వెళ్తున్నారు.. !

మండలంలో ఉన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు అందరూ వచ్చి ఇంటికి వచ్చిన వెంటనే అంతా బాగుంది అంటూ చెప్పుకుంటూ వెళ్లిపోతున్నారు. ముందుగా రెండు బజార్లలో మాత్రమే ఎమ్మెల్యే తిరుగుతాడని గ్రామ పంచాయితీ సిబ్బంది రెండు బజార్లు మాత్రమే శుభ్రం చేశారు. ఎమ్మెల్యే వస్తున్నాడనే ఆరెండు బజార్లు అయినా శుభ్రం చేశారు. పరిస్థితి దారుణంగా ఉండడంతో ఎమ్మెల్యేలు ప్రతి ఇంటికి వెళ్లడానికి సమస్యల భయం పట్టుకుంది. కానీ అధిష్టానం ఆదేశాల మేరకు కచ్చితంగా తిరగాల్సి రావడంతో కొన్ని బజార్లు చేసి మిగిలిన బజార్లు నాయకులను చేయమని చెప్పి వెళ్లిపోతున్న పరిస్థితి నెలకొంది. ఏదిఏమైనా ఇండ్లకు వెళుతున్న అధికార పార్టీ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు సమస్యలతో ప్రజలు స్వాగతం పలికి నిలదీస్తున్నారు.

మోసానికి బ్రాండ్ అంబాసిడర్ బాబు

- కూటమి వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- ఎన్నికల హామీలు గాలికొదిలేసి నియంత పాలన
- సంక్షేమ సారథి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి
- వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్



క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దద్దాల నారాయణ యాదవ్, నేతలు

వెలిగండ్ల,(కనిగిరిరూరల్): అధికారంలోకి వచ్చి ఏడాదైనా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ఒక్కటీ అమలు చేయకుండా చంద్రబాబు ప్రజలను నిలువునా మోసం చేశాడని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ ధ్వజమెత్తారు. వెలిగండ్లలో ఆదివారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ..(రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో) పై విస్తృత స్థాయి సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు గజ్జల వెంకటరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ పథకాల అమలుపై ప్రశ్నించిన వారి గొంతు నొక్కుతూ.. అక్రమ కేసులతో చంద్రబాబు, కూటమి నేతలు భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ ప్రజలు గమనిస్తున్నారన్నారు. అక్రమ కేసులకు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు భయపడే ప్రసక్తే లేదన్నారు. బాబు మోసాలను ప్రతి గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించాలన్నారు. సూపర్ సిక్స్ మోసాలను ప్రజలకు వివరించి చైతన్య వంతులను చేయాలని పిలుపునిచ్చారు. పథకాల అమలుపై కూటమి నేతలను ప్రజలు, పార్టీ కార్యకర్తలు గట్టిగా ప్రశ్నించాలన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీల సంఘం అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి మాట్లాడుతూ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. సంక్షేమ రథ సారథి వైఎస్ జగన్ అని కొనియాడారు. పార్టీలకు అతీతంగా ప్రతి గడపలో సంక్షేమ పథకాలను అందచేసినట్లు వివరించారు. కానీ కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. అనంతరం రీకాలింగ్ చంద్రబాబు క్యూ అర్ కోడ్‌పోస్టర్‌ను దద్దాల నారాయణ, పార్టీ నేతలు ఆవిష్కరించారు. తొలుత మహానేత వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తాతపూడి పుష్పమ్మ, సైకం ఏడుకొండలు రెడ్డి, కటికల వెంకటరత్నం, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, నాగూర్ యాదవ్, తాతపుడి సురేష్, తాతపుడి నానీ, శివరామిరెడ్డి, ఆవుల తిరుపతిరెడ్డి(ఏటీఆర్), ఎలికా నారాయణ, బొబ్బ వెంకటరెడ్డి, చెన్న కృష్ణయ్య, తిరుపతిరెడ్డి, జైపాల్ బాబు, గాలి తిరుపతిరెడ్డి, గోనా జేమ్స్, గంజి రవీంద్రారెడ్డి, నన్ను సానే నారాయణ, పాపబత్తుని నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ, అభిషేకం



మహా నైవేద్య ప్రదక్షిణలో పాల్గొన్న ఈఓ, చైర్మన్, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం శ్రీనారాయణస్వామి అభిషేకోత్సవం అర్చకులు శ్రీమంకాల శివప్రసాద్ వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని గోశాలలో గోపూజ నిర్వహించారు. అనంతరం మహా నైవేద్యంతో వేడుకగా భజంత్రీల నడుమ ఆలయ ప్రదక్షిణ చేసి స్వామికి నైవేద్యంగా సమర్పించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, కొమ్మినేని వెంకట్రావు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టంగుటూరు: మండలంలోని జమ్ములపాలెం సబ్ స్టేషన్ పరిధిలో 33/11 కేవీ లైన్‌లో మరమ్మతుల కారణంగా సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టంగుటూరు వెస్ట్ కాలనీ, ఎమ్మార్వో ఆఫీస్, జమ్ములపాలెం, కాకుటూరివారి పాలెం, జయవరం గ్రామాల్లో ఉదయం 8:30 గంటల నుంచి 11:30 వరకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామ ప్రజలు విషయాన్ని గమనించి విద్యుత్‌కు సంబంధించిన పనులను ముందుగానే ముగించుకొని తమకు సహకరించాలని ఆయన కోరారు.

కోటా శ్రీనివాసరావు మృతి తీరని లోటు

సింగరాయకొండ: ప్రముఖ సినీ హాస్యనటుడు కోట శ్రీనివాసరావు మృతి సినీ పరిశ్రమకు తీరని లోటని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. హాస్యనటుడుగా, విలన్‌గా సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేసుకున్నాడని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని కోరుతూ నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కోటా మృతికి సంతాపం

కందుకూరు: ప్రముఖ సినీ నటుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత కోటా శ్రీనివాసరావు మృతి సినీ రంగానికి తీరని లోటని జాషువా సాహిత్య, సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు ముప్పవరపు కిశోర్, కార్యదర్శి చనమాల కోటేశ్వరరావు, ట్రెజరర్ గాండ్ల హరిప్రసాద్‌లు ఆదివారం ఒక ప్రకటనలో తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సినీ పరిశ్రమలో విలక్షణ నటుడిగా పేరు పొంది భారత ప్రభుత్వంచే పద్మశ్రీ అవార్డును అందుకోవడమే కాకుండా, రాష్ట్ర ప్రభుత్వం తరుపున పలుమార్లు నంది అవార్డును అందుకున్న గొప్పనటుడు కోటా శ్రీనివాసరావు అని కొనియాడారు. హాస్యనటుడుగా, ప్రతినాయకుడుగా ఎన్నో పాత్రలు పోషించి ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేశారని గుర్తు చేశారు. తెలుగులోనే కాకుండా, హిందీ, తమిళం, మలయాళం, కన్నడం వంటి భాషల్లోను నటించి ప్రేరు ప్రఖ్యాతలు పొందారన్నారు. అటువంటి గొప్పనటుడిని కోల్పోవడం సినీ పరిశ్రమకు, కళామతల్లికి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు.

రత్నకుమారిని పరామర్శించిన దద్దాల



రత్నకుమారిని పరామర్శిస్తున్న ఇన్‌చార్జ్ దద్దాల, నేతలు

పామూరు: మండలంలోని అయ్యవారిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకురాలు తుమ్మా రత్నకుమారి ఇటీవల బైక్‌పై నుంచి పడి తలకు గాయాలై బ్రెయిన్ సమస్యతో బాధపడుతోంది. ఈ సందర్భంగా శనివారం రాత్రి అయ్యవారిపల్లెలోని ఆమె నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, కల్లూరి రామిరెడ్డి, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, తాళ్ల నాగేశ్వరరెడ్డి, తుమ్మా వెంకటేశ్వర్లు, సైకం సుబ్బారెడ్డి, కందుల మల్లికార్జునరెడ్డి, సుబ్బారెడ్డి, నారాయణ, చింతలపూడి గురుస్వామి, బ్రహ్మారెడ్డి, పుట్ట మాలకొండారెడ్డి, తాతిరెడ్డి రాజశేఖర్, ఎంపీటీసీ సవరం రత్తమ్మ, పిచ్చిరెడ్డి, ఉడుముల లక్ష్మిరెడ్డి, మట్టే కొండలరావు, రుగులగడ్డ మహేష్, చిన్న కొండయ్య, జడ దావీదు, యేసయ్య, మహంకాళి విజయ్ పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

హనుమంతునిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మధురానుభూతల మధ్య ఉల్లాసంగా సాగింది. పాఠశాల హెచ్ఎం నరసింహారావు అధ్యక్షతన 1995 నుంచి 1999 బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు అప్పటి సంగతులను గుర్తు చేసుకొని మనసారా నవ్వుకున్నారు. ఆనాటి స్మృతులను గుర్తుకు తెచ్చుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం పూర్వ విద్యార్థులంతా కలిసి రూ.17 వేల విలువైన ప్రింటర్‌ను పాఠశాలకు అందజేశారు. పూర్వ విద్యార్థి ప్రస్తుతం సీతారాంపురం ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు బీవీ సుబ్బారావు, పూర్వ విద్యార్థులు కస్తాల బాలాజీ, ఆర్ శ్రీనివాసుల, నాలి హరిక్రిష్ణ, భూమిరెడ్డి కృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి, ఊటా సుబ్బారెడ్డి, షేక్ సుభాని, రామకృష్ణారెడ్డి, ఆదిలక్ష్మి, మోహన్‌చారి, ఎలిక తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న దద్దాల

వెలిగండ్ల,(కనిగిరిరూరల్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని హుస్సేన్‌పురం పంచాయతీ బొంతగుంట్లకు చెందిన పార్టీ కార్యకర్త వేశపోగు రామయ్యను ఆదివారం వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పరామర్శించారు. ప్రమాద ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామయ్యకు రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీల సంఘం అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, పార్టీ అధ్యక్షుడు గజ్జల వెంకటరెడ్డి, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు కటికల వెంకట రత్నం, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, తాతపుడి సురేష్, ఆవుల తిరుపతిరెడ్డి, ఉండేల చిన వెంకటరెడ్డి, కసిరెడ్డి శ్రీను, మాదిరెడ్డి నరసారెడ్డి, గంజి రవీంద్రారెడ్డి, బచ్చు వెంగళరావు గుప్తా, రాచర్ల నరేష్, సంగటి బాబు, ఇసాకు, ఇజ్రాయేలు, కొండయ్య, రాజేష్, వెలుగొండయ్య, వేశపోగు ఆదాం, సుధాకర్, ప్రభాకర్ తదితరులు అదే విధంగా ఇటీవల ప్రమాదంలో గాయపడిన నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గూడూరి అనీల్ బాబును పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలో మొహర్రం వేడుకలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వేడుకలను భక్తులు అట్టహాసంగా నిర్వహించుకున్నారు. వేడుకల సందర్భంగా పెద్దషరగత్‌ను శనివారం నిర్వహించుకున్నారు. ఆదివారం భారీ ఎత్తున్న పీర్లచావిడి వద్దకు చేరుకున్న భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. పీర్ల వద్ద తమ చిన్నారులకు దీవెనలు అందింపజేసుకున్నారు. మరికొందరు భక్తులు ముజావర్ల వద్ద తమ చిన్నారులకు ఎటువంటి కీడు జరుగకుండా ఉండాలని కోరుకుంటూ తాయెత్తులను కట్టించుకున్నారు. ఈసందర్భంగా కొందరు పీర్ల చావిడి వద్ద విచిత్ర వేషధారణలతో సందడి చేస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. పీర్లను మండల కేంద్రంలో ఊరేగింపు నిర్వహించి షహదత్ కార్యక్రమాలను నిర్వహించారు. మండల పరిధిలోని యడవల్లి, గంటవానిపల్లె, రామచంద్రకోట, చింతల అగ్రహారం, కటకానిపల్లె గ్రామాల్లో మొహర్రం వేడుకలను భక్తులు ఉత్సాహ వాతావరణంలో జరుపుకున్నారు.

చినపవని చెరువు ఏడుస్తోంది..!

- చినపవని చెరువులో కరిగిపోతున్న మట్టి
- యథేచ్ఛగా టీడీపీ నాయకుల అక్రమ తరలింపు
- రాత్రి వేళ మట్టి తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు

లింగసముద్రం:

ఇసుక, మద్యం, మట్టి, గ్రావెల్, చెట్లు.. ఇలా ఒకటేమిటి ఏది దొరికితే చాలు దాన్ని చెరబట్టి రెండు చేతులా అక్రమకంగా సంపాదిస్తున్నారు టీడీపీ నాయకులు. ప్రకృతిని సర్వనాశనం చేసేవరకు కంకణం కట్టుకునేలా ఉన్నారు. అనుమతుల్లేవు..అడిగేటోళ్లు లేరు. ఇంకేముంది టీడీపీ నాయకులు మట్టిని దర్జాగా తవ్వేస్తున్నారు. ఇలా అక్రమార్కులకు మట్టి వ్యాపారం కాసుల వర్షం కురిపిస్తుండగా ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. మండలంలో అక్రమంగా మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. మండల పరిధిలోని చినపవని చెరువు నుంచి గ్రామ శివార్లలో లేఅవుట్ కోసం ప్రతి రోజూ వందల సంఖ్యలో రాత్రి వేళల్లో మట్టిని తరలిస్తున్నా అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. లేఅవుట్‌కు పట్టపగలే చెరువులో నుంచి మట్టి తోలేందుకు ప్రయత్నించి గ్రామస్తులు అడ్డుకోవడంతో రాత్రివేళల్లో పనిసాగిస్తున్నారు.



గ్రావెల్ లోడు చేస్తున్న జేసీబీ



మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

నిమ్మకు నీరెత్తినట్లుగా అధికారులు..

చెరువులో మూడు ఎక్స్‌వేటర్లతో 30 ట్రాక్టర్లకు పైగా మట్టిని లేఅవుట్‌కు తరలిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో ధనార్జనే ధ్యేయంగా మట్టిని కొల్లగొడుతూ లక్షలాది రూపాయలు ప్రజాధనాన్ని దోచుకుంటున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడంలేదని తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వెంచర్లు, లేఅవుట్లు, రియల్ ఎస్టేట్‌లకు అక్రమంగా మట్టిని తోలుకు పోతున్నారని అధికారులకు తెలిసినా, తెలియనట్లు వ్యవహరించడడం గమనార్హం. గత కొన్ని రోజులుగా రాళ్లపాడు ప్రాజెక్టు నుంచి, పెదపవని చెరువు నుంచి, మాలకొండ్రానిపాలెం తదితర చెరువుల నుంచి మట్టి తవ్వకాలు, రవాణా యథేచ్ఛగా సాగుతున్నాయి. ట్రాక్టర్ మట్టి రూ. 1000 నుంచి రూ. 1200 వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. అధికార పార్టీ నాయకులు సొమ్ములు ముట్టజెప్పి యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరుపుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

నియంత్రణలేని అతివేగం..

మట్టి అక్రమ రవాణా చేసే ట్రాక్టర్ల డ్రైవర్లు మద్యం తాగి ట్రాక్టర్లు అతివేగంగా నడుపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎక్కువ ట్రిప్పులు తోలాలనే అత్యుత్సాహంతో అత్యంత వేగంగా ట్రాక్టర్లు నడుపుతున్నారు. ఈ క్రమంలో ప్రమాదాలు జరుగుతాయనే ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. మట్టి రవాణా చేస్తున్నా ట్రాక్టర్లకు సరైన పత్రాలు, ఫిట్‌నెస్ లేని వాహనాలు కూడా మట్టి రవాణాకు ఉపయోగిస్తున్నారు. ఇటీవల పెదపవని చెరువు నుంచి మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు గ్రామంలో నుంచి అతివేగంగా వెళుతుండడంతో గ్రామస్తులు అడ్డుకోవడంతో మట్టి తరలింపును ఆపివేశారు. ఈ విషయమై అధికారులకు చెప్పినా ఎవరూ పట్టించుకోకపోవడంతో గ్రామస్తులే ట్రాక్టర్లకు అడ్డం తిరిగి గ్రామంలో నుంచి మట్టి ట్రాక్టర్లు తిరగనివ్వమని కరాఖండీగా చెప్పడంతో చేసేది లేక ఆపివేశారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు స్పందించి మట్టి అక్రమ తవ్వకాలను నిలుపుదల చేయాలని స్థానికులు కోరుతున్నారు.